నీటి సమస్య రానివ్వొద్దు

ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట్/ఫహాడీషరీఫ్, ఏప్రిల్ 8: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మాజీ మంత్రి సబితా ఇంద్రా రెడ్డి వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో తాగునీటి సమస్య పరిష్కారానికి వాటర్ వర్క్స్ అధికారులు (హెచ్ఎండబ్ల్యూఎస్) అధికారులు) తో సమీక్ష సమావేశం నిర్వహించారు. జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలాలను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న నాలా పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేశారు. పనుల విషయంలో ఎవరు నిర్లక్ష్యం చేసిన చర్యలు తప్పమన్నారు. ఎస్ఎన్‌డీపీ నాలా పెండింగ్ పనులతో పాటు ఏఏ కాలనీలో తాగునీటి సమస్య జఠిలంగా ఉందో గుర్తించాలని ఆమె మున్సిపల్ అధికారులకు, వాటర్ వర్క్స్ అధికారులకు సూచించారు. వేసవికాలం పోయేంతవరకు అధికారులు అప్రమత్తంగా ఉండి నీటి సమస్యలు రాకుండా చూడవలసిన బాధ్యత ఉందన్నారు. చాలా కాలనీలలో ఇప్పటికే నీటి సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని ఆమె అధికారులకు సూచించారు. ప్రజల సమస్యలను గుర్తించి ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా చొరవ తీసుకోవాలన్నారు. అధికారులు ఎవరు కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా నీటి సమస్య పరిష్కారం కోసం కృషి చేయవలసిన అవసరం ఉందన్నారు. ఎక్కడైనా పైప్‌లైన్ లీకేజీలు ఉన్నవెంటనే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. ఇప్పుడే నీటి సమస్య ఇలా ఇక రానున్న రోజులలో నీటి సమస్య జటిలంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఉన్న నీటిని ఏ విధంగా పొదుపుగా వాడుకోవచ్చునో అధికారులు ప్రజలకు తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. నీటిని వృధా చేయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలో 100 శాతం పేద ప్రజలే నివసిస్తున్నారని ఆమె తెలిపారు. వారందరూ బోర్లు వేసుకోలేని పరిస్థితిలో ఉన్నారు కనుక కృష్ణ వాటర్ పైన ఆధారపడి ఉంటారన్నారు. ట్యాంకర్లు కొనుక్కొనే స్తోమత వారికి లేదన్నారు. పేద ప్రజలకు సక్రమంగా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. వేసవి కాలం పోయేంతవరకు సక్రమంగా నీటి సరఫరా జలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట్రాం, జలమండలి అధికారులు జీఎం శ్రీనివాస్ రెడ్డి, ఏజీఎం శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, అయేషా,వాటర్ లైన్ మ్యాన్లు మాజీ ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జల్‌పల్లిలో ఎస్ఎన్‌డీపీ నాలాను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

జల్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

ఎల్బీనగర్, ఏప్రిల్ 8 : అంబర్‌పేట్ న్యూ పటేల్ నగర్‌కు చెందిన బాధితురాలి కుటుంబ సభ్యుడికి రూ. 60 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా మంగళవారం అందజేశారు. పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంగా మారిందని పేర్కొన్నారు.

నూతన నియామకం

శ్రీనివాస్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న రమేశ్,దయానంద్

సైదాబాద్, ఏప్రిల్ 8: బహుజన సమాజ్ పార్టీ మలక్‌పేట నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా సైదాబాద్ చెందిన పానుగంటి శ్రీనివాస్‌ను నియమిస్తూ బీఎస్పీ సెంట్రల్ కోఆర్డినేటర్ దయానంద్, ధర్మేందర్,జిల్లా అధ్యక్షుడు గిరి, హైదరాబాద్ జిల్లా బీఎస్పీ ఇన్‌చార్జి అల్గోల రమేశ్ కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పానుగంటి శ్రీనివాస్ మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేయడానికి బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్ని వర్గాల ప్రజల సహకారంతో పార్టీ పటిష్టతకు పని చేస్తానని తెలిపారు. శ్రీనివాస్‌ను అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండ్లగూడ, ఏప్రిల్ 8: కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల దర్గా ఖాలీజ్ ఖాన్ లో పనిచేయుటకు మహిళల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. స్కావెంజర్, మహిళా వాచ్‌మెన్‌గా పనిచేసేందుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. విద్యార్హతలు ఏడు నుంచి పదో తరగతి వరకు ఉండాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 11 లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9676769280, 6304530160 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

లారీ ఢీకొని ప్రయాణికుడు మృతి

హయత్ నగర్, ఏప్రిల్ 8 : లారీ, ఆటోను వెనుక నుంచి ఢీకొనడంతో ఓ ప్రయాణికుడు మృతిచెందగా ఆటో డ్రైవర్ కు గాయాలయ్యాయి. ఈ ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హయత్ నగర్ బస్టాండ్ సమీపంలో ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట విజయవాడ జాతీయ రహదారిపై ఎల్బీనగర్ వైపు నుంచి హయత్ నగర్ కు వస్తున్న ఆటోను వెనుక నుంచి అతివేగంగా, అ జాగ్రత్తగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎల్బీనగర్, కాకతీయ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న భుగత ఎల్లయ్య ఎడమ కాలికి గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ జంగయ్య కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఎల్లయ్యను 108 అంబులెన్స్ లో ఉస్మానియా హాస్పిటల్ కి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. లారీ డ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుమారుడు పరశురాం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని డెయిరీ ఫాం చౌరస్తా వద్ద విద్యుత్ స్తంభానికి ఉన్న వైర్లు ఒకదానికొకటి తగలడంతో మంటలు చెలరేగాయి. దీంతో వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానికులు వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. ఘటనా స్థలానికి విద్యుత్ అధికారులు చేరుకొని మరమ్మతులు చేశారు. – బండ్లగూడ, ఏప్రిల్ 8

ఎల్బీనగర్,ఏప్రిల్ 8: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభల నేపథ్యంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన జిల్లా బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నూతన కార్యవర్గం

సమావేశంలో మాట్లాడుతున్న మహిళా నేత

మన్సూరాబాద్, ఏప్రిల్ 8: నాగోల్ డివిజన్ పరిధి సాయి నగర్ కాలనీలోని ధర్మ భిక్షం భవన్‌లో మంగళవారం భారత జాతీయ మహిళా సమాఖ్య గ్రేటర్ హైదరాబాద్ సమావేశాన్ని నిర్వహించి సాయి నగర్ కాలనీ భారత జాతీయ మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా ఎండీ ఫైమీద, సభ్యులుగా సహేద బేగం, ధనమ్మ, పద్మ, అచ్చాలి, కమిలి, ప్రమీల హేమలత, అంజమ్మ, బాలమని, పద్మ, నిర్మలమ్మ, విజయలక్ష్మి, చిన్నమ్మ, మనెమ్మ, హేమలత, లక్ష్మి, లావణ్య, షమీం, పల్లవి, అరుణ, సాయమ్మ, సరోజ నియమితులయ్యారు. కమిటీ సభ్యురాలు సహేదా బిగం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి మహిళా సమాఖ్య సీనియర్ నాయకులు ప్రేమ పావని, గ్రేటర్ హైదరాబాద్ సీపీఐ పార్టీ కార్యదర్శి ఛాయాదేవి హాజరై మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం దేశంలో అధికారంలోకి వచ్చాక మహిళలపై దాడులు పెరిగిపోయాయన్నారు. నాగాలాండ్ లో జరిగిన ఘటనలు చాలా దుర్మార్గమని సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకునేలా ఉన్నాయన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా ఎన్ని ప్రభుత్వాలు మారినా మహిళల బతుకులు మారలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ ఫైమీద, గ్రేటర్ హైదరాబాద్ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు నళిని హాజరయ్యారు.

'ఎర్లీబర్డ్'ను సద్వినియోగం చేసుకోండి

మారుతిదివాకర్

అంబర్‌పేట, ఏప్రిల్ 8: ప్రభుత్వం కల్పించిన ఎర్లీబర్డ్ ఆఫర్‌ను ఆస్తిపన్ను చెల్లించేవారు సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ అంబర్‌పేట సర్కిల్ డీసీ మారుతీదివాకర్ కోరారు. ఈ నెల 30 వ తేదీలోపు ఈ ఆఫర్‌ను ఉపయోగించుకున్న వారికి 5 శాతం రిబేట్ లభిస్తుందని తెలిపారు. సర్కిల్ పరిధిలోని హిమాయత్‌నగర్, కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్ అంబర్‌పేట తదితర డివిజన్ల లో ఉన్న ఆస్తిపన్ను దారులకు ఇది మంచి అవకాశమన్నారు. సర్కిల్ ఎర్లీబర్డ్ లక్ష్యం రూ.29.23 కోట్లుగా ఉందని, ఈ నెల 7వ తేదీ వరకు రూ.4 కోట్లు వచ్చిందని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీల్లో పోషకాహారం అందించాలి

మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతి శ్రీ

కందుకూరు ,ఏప్రిల్ 8: అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు అందించాలని మహేశ్వరం డివిజన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి శాంతి శ్రీ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కొత్తూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణుల నుంచి రెండు సంవత్సరాల వయసు వచ్చేవరకు పోషకాహార లోపం లేకుండా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. పిల్లల్లో ఉబస కాయాన్ని తగ్గించడానికి ఆరోగ్యవంతమైన జీవనశైలి కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆరోగ్యవంతంగా ఉండటం కోసం సమతుల్యమైన ఆహారం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా గర్భిణులకు బరువు, ఎత్తులు చూశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఇందిర, అంగన్వాడీ టీచర్ గోవిందమ్మ బాలింతలు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి యాగం

లక్ష కుంకుమార్చనలో శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి

ఆర్కే పురం, ఏప్రిల్ 8 : ఆర్కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో మహాలక్ష్మి యాగం ఘనంగా కొనసాగుతుంది. యాగంలో భాగంగా మంగళవారం ఉదయం 8 గంటలకు తీర్థగోష్టి అనంతరం వేద ఇతిహాస పురాణ స్తోత్ర దివ్య ప్రబంధ విన్నపం, చతుస్థానార్చన యజ్ఞ, కార్యక్రమాలు నిర్వహించారు.ఉదయం10 గంటలకు శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీ దేవనాథ రామానుజ జీయర్ స్వామి వారి అనుగ్రహ భాషణం చేశారు.ఉదయం 10:30 గంటలకు మంగళ సౌభాగ్యాల కోసం శ్రీ లక్ష్మీనారాయణులకు శోభాయాత్ర రోజున స్త్రీమూర్తులతో ఊరేగింపుగా తేబడిన పసుపు కుంకుమలతో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం 6గంటలకు వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో లక్ష వత్తుల దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గోల్నాక, ఏప్రిల్ 8 : స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ తెలిపారు. మంగళవారం డివిజన్ లోని దుర్గా నగర్‌లో ఆయన పర్యటించారు. స్థానికులను అడిగి సమస్యలు తెలుసుకున్నాడు. ముఖ్యంగా బస్తీలోని లో ప్రెషర్ మంచినీటి సరఫరాతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకురాగా... వెంటనే ఆమర సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సంతోష్ చారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీవరేజీ పనుల్లో నాణ్యత పాటించాలి

ఇందిరానగర్‌లో సీవరేజీ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బండారు శ్రీవాణి.

రామంతాపూర్ ఏప్రిల్ 8 : రామంతాపూర్ ఇందిరానగర్‌లోని రూ.88 లక్షలతో చేపట్టిన సీవరేజీ పనులను రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్ రావు మంగళవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో బండారు వెంకట్రావు, మేనేజర్ రవీందర్, వాటర్ వర్క్స్ సూపర్ వైజర్ కిషన్, బీజేపీ నాయకులు నాగేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్లో దోపిడీని అరికట్టాలి

కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న టీఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్

బండ్లగూడ, ఏప్రిల్ 8: రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల యజమానులు అడ్డగోలుగా దోచుకుంటున్నారు. ఆయా పాఠశాలలపై తగిన చర్యలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి నీ తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీనివాస్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో ప్రైవేట్ పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. బుక్స్, స్టేషనరీ, దుస్తులు పేరుతో అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ విషయం గతంలోని జిల్లా విద్యాధికారి దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. వెంటనే స్పందించి రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలపై నిఘా ఏర్పాటు చేసి దోపిడీని అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఓ రాష్ట్ర అధికార ప్రతినిధి రమేష్‌గౌడ్, రఘు ముదిరాజ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

కాచిగూడ, ఏప్రిల్ 8: కాచిగూడ హర్రస్ పెంటలో ని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ఈ నెల 12 తేదీన శ్రీ హనుమాన్ జయంతి వేడుకలకు భారీ ఎత్తున ఏర్పాట్లు నిర్వహిస్తున్నట్లు హిందూ శ్మశాన వాటిక ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ 12వ తేదీ శనివారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో పూజలు మొదలై ఉదయం 10:30 నిమిషాలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుగుతాయని తెలిపారు. వ్రతం చేసుకుని భక్తులు ముందుగా తమ పేర్లను దేవాలయంలో నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వేల మందికి అన్నప్రసాద కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ హనుమాన్ జయంతి పూజా కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ విగ్, సాయి గిరిధర్, బి.కృష్ణ గౌడ్, రతన్ విద్యాసాగర్, పాల్గొన్నారు.

లిఫ్ట్‌తో అవస్థలు

మూడు సర్కిళ్ల కార్యాలయంలో పనిచేయని లిఫ్ట్

ఎల్బీనగర్, ఏప్రిల్ 8: ఎల్బీనగర్ మూడు సర్కిళ్ల కార్యాలయంలో లిఫ్ట్ ఎప్పుడూ రిపేర్లతోనే సేవలు అందిస్తోంది. సర్కిల్ కార్యాలయం గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటుగా మరో రెండు ఫ్లోర్లతో ఉన్న భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో సరూర్‌నగర్ సర్కిల్, మొదటి అంతస్తులో ఎల్బీనగర్ సర్కిల్, రెండో అంతస్తులో హయత్‌నగర్ సర్కిల్ కార్యాలయాలు కొనసాగుతున్నాయి. మొదటి, రెండో అంతస్తుల్లోని కార్యాలయాలకు వచ్చే అధికారులు, సిబ్బంది మొదలు ప్రజలు, సీనియర్ సిటిజన్స్ కోసం లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. ఈ లిఫ్ట్ ఏర్పాటు చేసింది మొదలు ప్రారంభోత్సవానికే నెలలు పట్టింది. ఇక ఎలాగోలా లిఫ్ట్ వచ్చిందిగా అని సంబరపడేలోగా లిఫ్ట్‌కు రిపేర్ వచ్చింది. ఇలా ఒక్కసారి అంటే కాదు దాదాపు లిఫ్ట్ పెట్టిన నాటి నుంచి ఇప్పటివరకు పదుల సంఖ్యలో ఈ లిఫ్ట్‌కు మరమ్మతులు చేయాల్సి వచ్చింది.

కుష్టువ్యాధిపై అవగాహన కల్పించాలి

కుష్టువ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ముందస్తు జాగ్రత్తతో కుష్టు వ్యాధిని నయం చేయవచ్చని ప్రభుత్వ కుష్టు వ్యాధి ట్రైనింగ్ సెంటర్(నల్లకుంట)ఎస్ఎంఓ డాక్టర్ సుజాత అన్నారు. మంగళవారం జరిగిన సమావేశంలో కుష్టు వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరుతూ తెలంగాణ ఆరోగ్య శాఖ డైరెక్టర్ బి. రవీంద్ర నాయక్‌ను ఎస్ఎంఓ డాక్టర్ సుజాత ఆధ్వర్యంలో సిబ్బందితో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జె.ఎం.ఓ. డాక్టర్ సుష్మ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. – కాచిగూడ, ఏప్రిల్ 8

రైలు ఢీకొని వ్యక్తి మృతి

కాచిగూడ, ఏప్రిల్ 8: పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ చిమ్నా వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తి (35)మంగళవారం బుద్వేల్..శివరాంపల్లి రైల్వే స్టేషన్ మధ్య పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన గుర్తుతెలియని రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా దవాఖానకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పీర్జాదిగూడ ఏప్రిల్ 8: చికిత్స పొందు తూ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు స్థానికుల కథనం ప్రకారం.... బోడుప్పల్ కలానగర్ కాలనీలో నివాసముంటున్న ఏర్పుల సాయి కిశోర్ (34)స్థానికంగా ఉన్న వీరారెడ్డి కాలనీలో జస్ట్‌ఫిట్ పేరుతో జిమ్ నిర్వహిస్తున్నాడు. అదే కాలనీలో ఉంటున్న చంటి, కిశోర్ స్నేహితులు. వీరిద్దరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి.అయితే జరిగిన విషయంపై కక్ష పెంచుకున్న చంటి సోమవారం రాత్రి మరో ముగ్గురు స్నేహితులను తీసుకొని జిమ్ వద్దకు వెళ్లారు. జిమ్‌లో ఉన్న కిశోర్ గుర్తించి అక్కడ ఉన్న డంబుల్ తీసుకొని తలపై విచక్షణంగా దాడి చేసి వెంటనే అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన కిశోర్‌ను వెం టనే చికిత్స నిమిత్తం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. దీంతో కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడు చంటిని అదుపులోకి తీసుకున్నట్లు సహకరించిన ముగ్గురు యువకులు పరారీలో ఉన్నట్లు సమాచారం. ఈ దాడికి వివాహేతరసంబంధం కారణమని సమాచారం.

విద్యార్థులకు అండగా ఉంటాం

రామంతాపూర్ ,ఏప్రిల్ 8 : పేద విద్యార్థులకు అండగా ఉంటామని సామాజిక సే వా కార్యకర్త గడ్డం రవికుమార్ స్పష్టం చేశా రు.మంగళవారం తన సేవా కార్యక్రమం లో భాగంగా రామంతాపూర్ చర్చి కాలనీలో పాఠశాల విద్యార్థినీవిద్యార్థులకు ప్లేట్స్ ,టిఫిన్ బాక్సులను పంపిణీ చేశారు.

'రాజీవ్ యువ వికాసం'కు దరఖాస్తులు చేసుకోండి

మణికొండ, ఏప్రిల్ 8 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకం కోసం నిరుద్యోగ యువతీ యువకులు దరఖాస్తులు చేసుకోవాలని నార్సింగి మున్సిపల్ కమిషనర్ టి కృష్ణమోహన్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 వరకు దరఖాస్తులకు అవకాశం ఉన్నదన్నారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 60 ఏండ్ల వారు అర్హులన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

రవీంద్రభారతి,ఏప్రిల్ 8: ఆత్మకల్పన కూచిపూడి నాట్యలయం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని మెయిన్ హాల్‌లో అర్జున దశనమియం కూచిపూడి నృత్యప్రదర్శన ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వక్తలుగా డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి, నాట్యగురువు డాక్టర్ జ్యోతిరెడ్డి విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి అర్జున దశనమియం కూచిపూడి నృత్యప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా వక్తలు డా.వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ ప్రాచీన లలిత కళల మన పూర్వీకులు ప్రసాదించిన ప్రాచీన శాస్త్రీయ నృత్యాలని, ఈ ప్రాచీన కళలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత నాట్యగురువులపై ఉందన్నారు.సభకు ముందు ఆత్మకల్పన కూచిపూడి నాట్యాలయం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శన ఆహూతులను ఎంతగానో అలరించింది.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గిరీశ్‌చంద్ర, పలువురు నాట్యగురువులు పాల్గొన్నారు.